## క్లుప్తంగా

### మానవ అక్రమ రవాణా తీవ్ర నేరం

● సీనియర్ సివిల్ జడ్జి ఇబ్రహీం షరీఫ్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇబ్రహీం షరీఫ్

**ఒంగోలు సిటీ:** మానవ అక్రమ రవాణా అనేది వ్యవస్థీకృత నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. బుధవారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇబ్రహీం షరీఫ్ పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా, దోపిడీని అంతం చేయడం ఎలా అనే విషయాన్ని విద్యార్థినులకు వివరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, ప్రొబిషనరీ అధికారి రత్న ప్రసాద్, డాక్టర్ పి.ఇందిర, బి.శ్రావణి, శ్రీనివాసులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్):** ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం ఎండ్లూరుడొంక సమీపంలోని అంబేడ్కర్ కాలనీలో పరిసరాలను పరిశీలించారు. ఇళ్ల మధ్యలో చెత్త వేయరాదన్నారు. శానిటేషన్ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈ నాగార్జున, బాబ్జీ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### వేలం పాటలో రూ.9.24 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

**నాగులుప్పలపాడు:** మండలంలోని చదలవాడ పశుక్షేత్రంలో బుధవారం ఒంగోలు జాతి పశువులకు వేలం పాట నిర్వహించగా, 9 లక్షల 24 వేల రూపాయల ఆదాయం వచ్చినట్లు పశుక్షేత్రం డీడీ, ఇన్చార్జి జేడీపీ బి.రవి తెలిపారు. ఈ వేలంపాటలో 16 కోడె దూడలు, 16 పెయ్యదూడలు, 2 పెయ్యలు, 12 ఒట్టి ఆవులు కలిపి మొత్తం 46 పశువులను వేలం వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి చైర్మన్ కోసూరి రాధ, ఉపసంచాలకులు శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు బసవశంకరరావు, 70 మంది రైతులు పాల్గొన్నారు.

### తల్లిదండ్రులను విస్మరించడం నేరం



మాట్లాడుతున్న డీఆర్ఓ ఓబులేసు

**ఒంగోలు సబర్బన్:** వృద్ధులు సమాజానికి అనుభవజ్ఞులని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు అన్నారు. దివ్యాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల జిల్లా అధికారులకు బుధవారం ప్రకాశం భవనంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ బిడ్డలు తమ ఆస్తులను తీసుకున్నారు గానీ, తమ పోషణ గురించి పట్టించుకోవటం లేదని గ్రీవెన్స్‌లో సైతం ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సమాజంలో ఇలాంటి ధోరణి సరికాదన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వారి పోషణ, సంరక్షణను విస్మరించడం సరికాదన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, రీజినల్ రిసోర్స్ శిక్షణ కేంద్రం ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### పురుగుమందుల వాడకం తగ్గించాలి

**కొత్తపట్నం:** పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేయాలని మండల వ్యవసాయ అధికారి జి.కిషోర్‌బాబు కోరారు. మండలంలో రంగాయపాలెం, పిన్నివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాగార్జున సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ కల్పన, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ నరసింహులు, భవాని, రామారావు, సురేష్, అనివాష్, నంద కిశోర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.





వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మేరుగు నాగార్జున, నందిగం సురేష్, కొమ్మూరి కనకారావు,కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుప్పం ప్రసాద్

# వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా నాయకులు

**ఒంగోలు సిటీ/నాగులుప్పలపాడు:** వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో బుధవారం ఆ పార్టీ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్) బొట్ల రామారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు జగన్‌ను కలిశారు. అదేవిధంగా పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి జగన్‌ను కలవగా, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, మాజీ ఎంపీ నందిగం సురేష్, ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు తదితరులు జగన్‌ను కలిశారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాకుమాను రాజశేఖర్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బొట్ల రామారావు, బొట్ల సుబ్బారావు



సంతపేటలోని రైల్వే స్థలంలో చెత్తను తగలబెట్టడంతో భారీగా కమ్ముకున్న పొగ

# ఒంగోలు నగరంలో పొగ కాలుష్యం

● ఎక్కడికక్కడ చెత్తను తగలబెడుతున్న పారిశుధ్య కార్మికులు

● పొగతో అవస్థపడుతున్న ప్రజలు

**ఒంగోలు సబర్బన్/ఒంగోలు వన్‌టౌన్:** ఒంగోలు నగరంలో పారిశుధ్య కార్మికులు ఎక్కడికక్కడ చెత్తను తగలబెట్టడం వలన పొగ కాలుష్యం అధికమై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. అసలే నగరంలో పారిశుధ్యం మరీ అధ్వానంగా మారింది. ఇళ్ల నుంచి చెత్త తీసుకెళ్లే దిక్కులేక నగరంలోని ఇళ్లలో మూడు రంగుల ప్లాస్టిక్ డబ్బాలు నిండిపోతున్నాయి. చెత్త సేకరణ సక్రమంగా లేకపోవటంతో ప్రజలు చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయడం పరిపాటిగా మారింది. దానికితోడు రోడ్ల వెంట గతంలో ఉన్న భారీ డస్ట్ బిన్‌లను నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. చెత్త సేకరణ, తరలింపు అటకెక్కడంతో పారిశుధ్య కార్మికులు ఎక్కడి చెత్తను అక్కడే తగులబెడుతున్నారు. దాంతో పెద్ద ఎత్తున పొగ వ్యాపిస్తూ ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కాకుండా ఉన్నాయి.

# మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు సబర్బన్:** మానవ అక్రమ రవాణా నిర్మూలనలో క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను నిర్మూలించేందుకు న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాలను అమలు చేయడం, ఇంటెలిజెన్స్ ఆధారిత విచారణలు చేసి నిందితులను పట్టుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇందుకు బాధితులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మానవ అక్రమ రవాణా నిరోధకంతో పాటు బాధితుల హక్కులు, గౌరవం, నష్టపరిహారం, మానసిక వైద్యంతో పాటు జాప్యం లేకుండా పునరావాసం కల్పించడం ముఖ్యమన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ అధికారులు, న్యాయవాది, సామాజిక కార్యకర్త కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. చట్టాన్ని అమలు చేయడంలో సాంకేతికత వినియోగించడం, వివిధ జిల్లాలు, రాష్ట్రాలతో పాటు దేశాల మధ్య, ఏజెన్సీల మధ్య సమన్వయం పెంపొందించటం, ఆర్థిక లావాదేవీలను గమనించి నెట్‌వర్క్‌లను ఛేదించటం వంటి చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్, సంస్థ ప్రతినిధులు ఎం. మురళీ కృష్ణ, ఎస్‌కే మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

## సాగునీటి సౌకర్యానికి
# అవకాశాలను అన్వేషించాలి

● డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి ప్రసాద్

**మద్దిపాడు:** రైతులకు మెరుగైన సాగునీటి సౌకర్యాలు అందించటానికి ఉన్న అవకాశాలను అన్వేషించాలని డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయాలు, వాటి పరిస్థితి, అక్కడేమైనా ఆక్రమణకు గురై ఉన్నాయా..? అనే అంశాలను పరిశీలిస్తే తద్వారా జలాశయాల మరమ్మతులు, పునరుద్ధరణ చేయడానికి వీలవుతుందన్నారు. ఏడో చిన్న తరహా నీటి వనరులు, రెండో జలాశయముల గణనను ప్రతి ఐదు సంవత్సరాలకు కేంద్రం నిర్వహిస్తోందని, ఈ క్రమంలో గ్రామంలో ఉన్న భూగర్భ జల వనరుల పథకాలు, జలాశయాల గణన చేపట్టాలని వీఆర్వోలకు సూచించారు. గణన మొబైల్ యాప్ ద్వారా నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ గణన వలన ప్రభుత్వం రైతులకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడానికి, సాగునీటికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడానికి ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ సర్వేని యాప్లో నమోదు చేయాలని వీఆర్వోలను ఆదేశించారు. ముందుగా మండల వ్యవసాయ శాఖ అధికారిని స్వర్ణలత మాట్లాడుతూ వీఆర్వోలను సమన్వయం చేసుకుని గ్రామ వ్యవసాయ సహాయకులు ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. వీఆర్వోలు, వీఏఏలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈక్రాప్ నమోదు చేస్తే సూపర్ చెక్ సమయంలో ఇబ్బందులు ఎదురవకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఓ విజయలక్ష్మి, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.



వీఆర్వోలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసాద్

### రైతులకు కంది విత్తనాల పంపిణీ

**చీమకుర్తి రూరల్:** మండలంలోని చంద్రపాడు, పల్లామల్లి సచివాలయాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్, సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.రమేష్ పాల్గొని రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

### అనధికార లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి

**ఒంగోలు సబర్బన్:** అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం-2020ని సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ఒంగోలు నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓఎంఎస్ నంబరు-134ని కొత్తగా విడుదల చేసిందన్నారు. క్రమబద్ధీకరణ పథకం-2020ను పొడిగిస్తూ సవరణ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో 2025 జూన్ 30వ తేదీకి ముందు వేసిన అనధికార లే అవుట్లు, ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుంతో పాటు 14 శాతం ఓపెన్ స్పేస్‌చార్జీలు చెల్లించి క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. దరఖాస్తులను 2025 జూలై 26 నుంచి 90 రోజుల్లోగా 10 శాతం అపరాధ రుసుం చెల్లించి ఆన్‌లైన్ ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో దాఖలు చేయాలన్నారు. 25.10.2025లోపు క్రమబద్ధీకరణ చేసుకోని అనధికార లే అవుట్లలోని స్థలంలో భవిష్యత్తులో ఏ విధమైన భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబడవన్నారు. క్రమబద్ధీకరణ చేసుకోని అన్ని నాన్ లే అవుట్ ప్లాట్ల వివరాలను అమ్మకం, కొనుగోలు వీలులేకుండా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో నిషేధిత భూముల రిజిస్టర్లలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. అదనపు వివరాలు, సలహాలు, సందేహాలకు ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను సంప్రదించాలని సూచించారు.

### విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు సన్నాహాలు

సాక్షి ఎఫెక్ట్..

**ఒంగోలు సబర్బన్:** నగరంలోని భాగ్యనగర్ నాలుగో లైన్‌లో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డులోని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చేందుకు ఒంగోలు విద్యుత్ శాఖ అధికారులు సన్నద్ధమయ్యారు. ఆ మేరకు బుధవారం ఒంగోలు నగర విద్యుత్ శాఖ డీఈఈ కేవీ పాండురంగారావు, ఒంగోలు విద్యుత్ శాఖ డీ-2 ఏఈఈ డి.వెంకటేశ్వర్లు, సిబ్బందితో వచ్చి విద్యుత్ లైన్లు షిఫ్ట్ చేసేందుకు రోడ్డును పరిశీలించారు. ‘ఆహా..ఇంజినీర్ల చిత్రాలే వేరయా’ అనే శీర్షికతో ఈ నెల 21వ తేదీ సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు.. భాగ్యనగర్ నాలుగో లైన్‌లోని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను సిమెంట్ రోడ్డులో నుంచి షిఫ్ట్ చేసేందుకు ఒంగోలు విద్యుత్ శాఖ అధికారులకు సుమారు రూ.4.50 లక్షలు షిఫ్టింగ్ చార్జీల కింద చెల్లించారు. ఆ నగదు జమ కాగానే విద్యుత్ శాఖ అధికారులు వచ్చి రోడ్డు మార్జిన్‌కు వాటిని మార్చేందుకు కొలతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డీఈఈ పాండురంగారావు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా రోడ్డులో అడ్డం లేకుండా రోడ్డు మార్జిన్‌లోకి మారుస్తామన్నారు. రోడ్డును పరిశీలించేందుకు విద్యుత్ అధికారుల వచ్చినప్పుడు నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు, 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్ బాబు (చిన్నారి) ఉన్నారు.



పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ డీఈఈ పాండురంగారావు, ఏఈఈ వెంకటేశ్వర్లు, కమిషనర్ వెంకటేశ్వరరావు

# వ్యాక్సినేషన్‌తో వ్యాధులు దూరం

**నాగులుప్పలపాడు:** వ్యాక్సినేషన్‌తో వ్యాధులను దూరం చేయవచ్చని ప్రకాశం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కమలశ్రీ తెలిపారు. బుధవారం నాగులుప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమలశ్రీ మాట్లాడుతూ చికిత్స కంటే నివారణ మేలనే సూత్రం వ్యాక్సిన్లకు సరిపోతుందన్నారు. తద్వారా వ్యాధి నిరోధకత పెరిగి వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. తొలుత గర్భిణులు, చైల్డ్ రిజిస్ట్రేషన్, ఆర్‌సీహెచ్ పోర్టల్ రిజిస్ట్రేషన్, యూ విన్ పోర్టల్ రిజిస్ట్రేషన్లతో పాటు అన్ని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో నాగులుప్పలపాడు సీనియర్ వైద్యాధికారి డాక్టర్ ఓనరియల్, అమ్మనబ్రోలు వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్, తిమ్మసముద్రం వైద్యాధికారి ప్రసన్న, పోతవరం వైద్యాధికారి కుమారస్వామి, నాగులుప్పలపాడు హెల్త్ సూపర్ వైజర్ శౌరయ్య, నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల హెల్త్ నర్సులు, మల్టీ పర్పస్ ఆరోగ్య అధికారులు, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమలశ్రీ

### దొంగిలించిన వస్తువులు కొనుగోలు చేయొద్దు

**ఒంగోలు టౌన్:** చోరీకి గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల విడిభాగాలు, ఇనుప సామగ్రి పాత సామాన్ల కింద అమ్ముడవుతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు. చోరీ చేసిన వస్తువులను పాత ఇనుప సామాన్ల దుకాణాల్లో విక్రయించడం సులభమై పోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని చెప్పారు. పాత ఇనుప సామాన్లను కొనుగోలు చేసే సమయంలో వ్యాపారులు అప్రమత్తంగా వ్యవహరిస్తే చోరీలను అరికట్టడం సాధ్యమవుతుందని చెప్పారు. చోరీ సామాన్లను కొనుగోలు చేయవద్దని సూచించారు. ఒంగోలు టూ టౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలో పాత వస్తువులు కొనుగోలు చేసే వ్యాపారులతో బుధవారం సమావేశం నిర్వహించి డీఎస్పీ మాట్లాడారు.

### డిజిటల్ అసిస్టెంట్ లేక ప్రజలకు ఇబ్బందులు

**చీమకుర్తి రూరల్:** మండలంలోని ఇలపావులూరు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన సచివాలయ సిబ్బంది బదిలీలలో భాగంగా ఇలపావులూరు సచివాలయానికి వచ్చిన డిజిటల్ అసిస్టెంట్ డిప్యుటేషన్‌పై ఒంగోలు కలెక్టర్ ఆఫీస్‌కు వెళ్లాడు. దీంతో నెల రోజుల నుంచి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సేవలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయ

**సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్):** సంతనూతలపాడు మండలంలోని పాలకవర్గం, అధికారులు సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి పనిచేయాలని ఎంపీపీ బుడంగుంట విజయ అన్నారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ విజయ అధ్యక్షత వహించి ప్రసంగించారు. మండలంలో గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుం బిగించాలని ఎంపీడీవో సురేష్ బాబు కోరారు. తహసీల్దార్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మండలంలో రేషన్ కార్డులకు ఇప్పటికే రెండు వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంకెవరైనా కొత్త రేషన్ కార్డులకు అర్హులు ఉంటే దరఖాస్తులు దాఖలు చేసుకోవాలన్నారు. రెవెన్యూ పరంగా సమస్యలను తప్పనిసరిగా పరిష్కరిస్తామని తహసీల్దార్ నారాయణరెడ్డి సూచించారు. వైస్ ఎంపీపీ మండవ సులోచన మాట్లాడుతూ మండలంలో వేములపాడు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులలో అవినీతి అధికంగా ఉందని, వాటిపై చర్యలు తీసుకోవాలని ధ్వజమెత్తారు. సమావేశంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంపీటీసీలు టి.సుజాత, కే వెంకటేశ్వరరావు, ఎల్.నాగేశ్వరరావు, బడే వెంకట కృష్ణారెడ్డి, కె.సుబ్బారావు, సర్పంచులు దర్శి నాగమణి, జె.గౌతమి, ఈ విజయలక్ష్మి, ఎస్.మల్లయ్య, ఎం.రామానాయుడు, బొడ్డు రామారావు, ఎంఈఓ డి.వెంకారెడ్డి, మండల వెలుగు ఏపీఎం టి.బాబూరావు, ఏపీవో వాసంతి, అసిస్టెంట్ ఇంజినీర్లు వీరాంజనేయులు, మధుసూదన్‌రావు, కరిముల్లా, బాషా, రమణారెడ్డి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, పశువైద్యాధికారి కె.అనురాధ, డిప్యూటీ ఎంపీడీవో రమణమ్మ, మండల పరిషత్ ఏవో శారద, సీహెచ్ఓ మాధవరావు, విద్యుత్ సబ్ ఇంజినీర్ కృష్ణ, వ్యవసాయ శాఖ ఏఈఓలు సుబ్బారెడ్డి, వెంకట్రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

**ఒంగోలు టౌన్:** ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఒంగోలు నగరంలోని సుజాత నగర్లో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... స్థానికంగా నివాసం ఉంటున్న దుద్దుకూరు బాలకృష్ణ (36) భవన నిర్మాణ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో భార్య, కుమారుడు బజారుకు వెళ్లారు. కూతురు స్కూలుకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలకృష్ణ సీలింగ్ ఫ్యాన్కు ఉరి వేసుకుని మృతిచెందాడు. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయండి

**ఒంగోలు సిటీ:** ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ఆగస్టు 2వ తేదీన తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో చైర్మన్ కె.ఎర్రయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో పనిచేసే ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, బోధనకి పరిమితం చేయాలని, బోధనను హరించే యాప్‌లను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, పీఆర్ కమిషన్ వేసే ముందు ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, తదితర 18 డిమాండ్లతో కూడిన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంఈఓ-1 పోస్టులను కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి మాత్రమే నియమించాలని ఇచ్చిన జీవోను ఫ్యాప్టో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ గవర్నమెంట్ మేనేజ్మెంట్ నుంచి సంయుక్త సీనియార్టీ ప్రాతిపదిక నియమించాలని కోరారు. ఆగస్టు రెండో తేదీన జరిగే ధర్నాను ప్రతి హైస్కూల్, ప్రాథమిక ఉన్నత పాఠశాలల నుంచి 50 శాతం మంది ఉపాధ్యాయులు తగ్గకుండా హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల నాయకులు ఎస్కే ఎండీ రఫీ, వై.వెంకట్రావ్, షేక్ అబ్దుల్ హై, డి.శ్రీనివాసులు, బి.వెంకట్రావు, చల్లా శ్రీనివాసులు, డి.వీరాంజనేయులు, ఎస్.రవి, డి.శ్రీనివాసులు, పి.సుబ్బారావు, ఎన్.చిన్నస్వామి పాల్గొన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఫ్యాప్టో నాయకులు

# శాస్త్ర సాంకేతిక రంగాలపై దృష్టి సారించాలి

**ఒంగోలు సిటీ:** శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులు దృష్టి సారించాలని డీఈఓ కిరణ్‌కుమార్ సూచించారు. బుధవారం ఒంగోలు డివిజన్‌కు సంబంధించి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంపై టీచర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఒంగోలు డివిజన్ విద్యాశాఖ అధికారి చంద్రమౌళేశ్వరరావు అధ్యక్షత వహించగా, డీఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.